## నర్సరీని సందర్శించిన డీఆర్డీవో

రాజంపేట్, జూలై 3 : మండల కేంద్రంలోని నర్సరీని డీఆర్డీవో చందర్ నాయక్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో బ్యాగులు ఖాళీగా ఉండకుండా విత్తనాలు నాటాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాల యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో భాగంగా ఎక్కువ సంఖ్యలో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో రాజేశం, ఏపీవో సక్కుబాయి, ఏపీఎం సాయిలు, టీఏ భాస్కర్, రాజు, బ్రహ్మాచారి, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, సీసీ శ్రీనివాస్, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక



నియమాక పత్రాలతో అయ్యప్ప సేవా సమితి సభ్యులు

కామారెడ్డి, జూలై 3 : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప, అన్న ప్రసాద సేవా సమితి నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారికి ఎన్నికల అధికారులు కైలాస్ శ్రీనివాస్‌రావు, శెనిశెట్టి గౌరీ శంకర్ ధ్రువపత్రాలను అందజేశారు. స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడిగా గందె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గోనె శ్రీనివాస్, కోశాధికారిగా సోమిశెట్టి నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్న ప్రసాద సేవా సమితి అధ్యక్షుడిగా విశ్వనాథుల రాజేందర్, కార్యదర్శిగా బాస రఘుకుమార్, కోశాధికారిగా మోటుకూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

## బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

రామారెడ్డి/భిక్కనూరు, జూలై 3 : సదాశివనగర్ మాడల్ స్కూల్ నుంచి ట్రిపుల్ ఐటీకి 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ భానుమతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడుతలోనే 25 మంది ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. భిక్కనూరు మండలంలోని జంగంపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువున్న విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. జంగంపల్లికి చెందిన ఎస్కే జహీర్ ఖాన్ కూతురు సనా పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు గఫూర్ శిక్షక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థినిని అభినందించారు.

## సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి

భిక్కనూరు, జూలై 3 : తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించే నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు కోరారు. ఈ మేరకు సౌత్ క్యాంపస్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వరికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో డీఎస్సీ పరీక్షలు ఉన్నందున సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు కోరారు.

## పిచ్చికుక్క వీరంగం..

భిక్కనూరు, జూలై 3: పిచ్చికుక్క దాడిలో పలువురు గాయపడిన ఘటన భిక్కనూర్ మండలంలో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 44వ నంబర్ జాతీయ రహదారిలోని భిక్కనూర్ టోల్ గేట్ వద్ద బుధవారం ఓ వ్యక్తిని పిచ్చికుక్క కరిచింది. అనంతరం రామేశ్వర్‌పల్లి గ్రామానికి వెళ్లిన కుక్క.. దారిలో వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్న మహిళను కరిచింది. అనంతరం గ్రామంలోకి ప్రవేశించి ఐదుగురిని గాయపర్చింది. పిచ్చికుక్క దాడిలో నాగర్తి రాధవ్వ, గొల్లపల్లి వినోద్‌గౌడ్, నాగరాజ్‌గౌడ్, లలిత, పైతారి సుశీల గాయపడగా కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించారు. రాధవ్వకు 12, లలితకు 16, సుశీలకు 14 కుట్లు పడ్డాయని, ప్రస్తుతం బాధితులంతా చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.




*గాంధారి మండలంలోని కామారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారి పోతంగల్ కలాన్ గ్రామ స్టేజీ నుంచి చందానాయక్ తండా వరకు సుమారు 3.5కిలోమీటర్ల మేర రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్నది. ఈ విషయమై 'అప్పుడు దుమ్ముధూలితో.. ఇప్పుడు వర్షపు నీటితో..' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో జూన్ 30వ తేదీన కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో వాహనదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.*

*– గాంధారి, జూలై 3*

## ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు

భిక్కనూరు, జూలై 3 : మండల కేంద్రంలోని రెండు ప్రైవేటు పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారని విద్యార్థి సంఘం నేతలు డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డీఈవో రాజు స్పందిస్తూ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. తరగతి గదులను రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారన్నారు. వెంటనే పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, డీఈవోను కోరారు. ఈ విషయమై ఎంఈవో ఎల్లయ్యను సంప్రదించాగ స్పందించలేదు.

## స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలి

కామారెడ్డి, జూలై 3 : పెండింగ్‌లో ఉన్న ఎనిమిది వేల కోట్ల కుపైగా ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో ఏబీవీపీ నాయకులు బుధవారం భిక్షాటన చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రాక పోవడంతో కళాశాలల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, నాయకులు అల్తాఫ్, ప్రత్యూష, మానస, ప్రణీత, బలరాం, రాజులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత



బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు

కామారెడ్డి, జూలై 3 : ఇటీవల నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తనకు ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్‌కు విన్నవించాడు. ఈ మేరకు స్పందించిన జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బాన్సువాడ మండలం తిర్మలాపూర్‌కు చెందిన సంజీవకుమార్ అనే దివ్యాంగుడికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజన్న, వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, స్టేట్ ఎంసీ మెంబర్ సంజీవరెడ్డి, సెక్రటరీ రఘుకుమార్, కరస్పాండెంట్ డాక్టర్ పీవీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## బోర్‌మోటర్, హైమాస్ట్ లైట్ ప్రారంభం

మాచారెడ్డి, జూలై 3 : మండలంలోని అక్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్‌మోటర్, హైమాస్ట్ లైట్‌ను ఎంపీటీసీ లత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఐదేండ్లల్లో గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో భారతరాష్ట్ర సమితి మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం, నాయకులు రమేశ్, గడ్డం బాబు, శ్రీనివాస్‌రెడ్డి, దేవాచారి, మధు పాల్గొన్నారు.

### నేడు విద్యా సంస్థల బంద్‌ను
## విజయవంతం చేయాలి

కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట, జూలై 3 : విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గురువారం నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలన్నారు. విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేట్ యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విద్యార్థి సంఘ నాయకులు ఐరేని సందీప్, ముదాం అరుణ్, సురేశ్, శివ, మణికంఠ, భరత్, సరిచంద్ నాయకులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిలోని విద్యాసంస్థలు బంద్ పాటించాలని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నాగం శ్రీనివాస్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు రఫీక్ కోరారు. లింగంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరీక్షా పేపర్ల లీక్‌పై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ఆయనతోపాటు నాయకులు ఇర్ఫాన్, నదీం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

ఎల్లారెడ్డి రూరల్/ గాంధారి/కామారెడ్డి రూరల్, జూలై 3: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి, గాంధారి ఎస్సైలు మహేశ్, ఆంజనేయులు విద్యార్థులకు సూచించారు. ఎల్లారెడ్డిలోని జడ్పీబీహెచ్‌ఎస్, గాంధారిలోని కస్తూర్బాలో సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొబైల్‌ను పరిమితంగా వినియోగించుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు పంపిన లింక్‌ను క్లిక్ చేయొద్దని సూచించారు. గాంధారిలో ఏఎస్సై విజయలక్ష్మి, హెచ్‌ఎం వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నాగరాజు, చిరంజీవులు, హోంగార్డ్ పెంటయ్య, గాంధారిలో ఏఎస్సై గణేశ్, కస్తూర్బా ఎస్‌వో శిల్ప తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి మండలం దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న టేక్రియాల్ గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో కళాబృందం సభ్యులు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ.. సైబర్ నేరం జరిగినప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930కి బాధితులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. మూఢనమ్మకాలను వీడాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దేవునిపల్లి ఏఎస్సై కొండల్‌రెడ్డి, కళాబృందం సభ్యులు శేషు, ప్రభాకర్, ప్రవీణ్, సాయిలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# షరతులు లేకుండా రైతుభరోసా ఇవ్వాలి

### ప్రత్యేక సమావేశాల్లో రైతుల అభిప్రాయం



బోర్లంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

డోంగ్లీ/మద్నూర్/పెద్దకొడప్‌గల్/బాన్సువాడ టౌన్/ బాన్సువాడ రూరల్/బిచ్కుంద, జూలై 3: ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు రైతు భరోసా పథకంపై అన్నదాతల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. డోంగ్లీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ రామ్‌పటేల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సాగు భూమికి ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా ఇవ్వాలని రైతుల తరపున విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్, విండో వైస్ చైర్మన్ విజయ్‌పటేల్, మాజీ చైర్మన్ అశోక్ పటేల్, ఆనంద్ పటేల్, ఏవో రాజు, కార్యదర్శి గంగాధర్, ఉప కార్యదర్శి వీరేశ్, సిబ్బంది ప్రవీణ్, ఈర్వంత్ తదితరులు పాల్గొన్నారు. మద్నూర్ సహకార సంఘంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా సహకార సంఘం ఆడిట్ అధికారి రామ్మోహన్ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ శంకర్‌రావు, ఏవో రాజు, కార్యదర్శి బాబూరావు తదితరులు పాల్గొన్నారు. పోడు భూముల్లో పంటలు సాగుచేస్తున్న ప్రతి రైతుకూ రైతు భరోసా ఇవ్వాలని పెద్దకొడప్‌గల్ మండల రైతులు అభిప్రాయాలు వెల్లడించారు. సమావేశంలో ఏడీఏ లక్ష్మీనారాయణ రైతుల అభిప్రాయాను సేకరించారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, బిచ్కుంద ఏడీఏ లక్ష్మీప్రసన్న, ఏవో నదీముద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు చిప్పె మోహన్, నాగిరెడ్డి, కల్లూరి పండరి, నరహరి, సంజీవ్, ఏఈవోలు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నా రు. ఈ రైతు అవగాహన సదస్సులో రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాం నాయక్, దేశాయిపేట్ సొసైటీ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్, ఏవో సుధాకర్, ఏఈవోలు మీనా, రాజేశ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. బాన్సువాడ సొసైటీ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో రైతుభరోసా, రైతు బీమాపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ అభిప్రాయాలను ఉన్నతాధికారులకు చేరవేస్తామని తెలిపారు. రైతు భరోసా, రైతు బీమా వర్తింపు విషయంలో ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల తరపున బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ అనిల్‌కుమార్, ఏవో సుధాకర్, మానిటరింగ్ అధికారి కరుణాకర్ రెడ్డి, ఏఈవో రాణి, సొసైటీ అధికారి నారాయణ రెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. బిచ్కుంద, పుల్కల్ సొసైటీల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సహకార సంఘం డిప్యూటీ రిజిస్ట్రార్ వెంకట్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్, మానిటరింగ్ ఆఫీసర్ అబ్దుల్ హలీమ్, ఏడీఏ లక్ష్మీప్రసన్న, ఏవో రాజలింగం, బిచ్కుంద, పుల్కల్ విండో చైర్మన్లు నాల్చర్ బాలాజీ, రామక్రిష్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'కాలేజీలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం'



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారి

నాగిరెడ్డిపేట, జూలై 3: నూతనంగా మంజూరైన నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ఇంటర్ కళాశాలకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. నాగిరెడ్డిపేట కాలేజీ విద్యార్థులకు జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ వినీత, ఎంపీటీసీ మాధవీ సంతోష్‌గౌడ్‌తో కలిసి ఆయన బుధవారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి గత విద్యా సంవత్సరం కళాశాల మంజూరైందన్నారు. ఈ సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో విద్యా బోధన జరుగుతుందన్నారు. వసతులను కల్పించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. జిల్లాలోని 20 ప్రభుత్వ కాలేజీల్లో ప్రథమ సంవత్సరంలో 1,700, ద్వితీయ సంవత్సరంలో తొమ్మిది వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశం, కాలేజీ ప్రిన్సిపాల్ హేమచందర్, గోపాల్‌పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ

ఎల్లారెడ్డి, జూలై 3: పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ సాయి బాబా బుధవారం యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న మొత్తం 500మందికి ఒక జత చొప్పున దుస్తులను పంపిణీ చేశారు. ఆగస్టు నెలలో మరో జత దుస్తులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారుల సహకారం గుర్తుంచుకుంటాం..

### సన్మాన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు



నిజాంసాగర్ ఎంపీపీ జ్యోతిని సన్మానిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ రాజు



దోమకొండలో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు..

నాగిరెడ్డిపేట/ గాంధారి/ నిజాంసాగర్/ కామారెడ్డి రూరల్/ బీబీపేట్/ రాజంపేట్/ దోమకొండ, జూలై 3: తమ పదవీకాలంలో అభివృద్ధి పనుల్లో పూర్తి సహాయ సహకారాలు అందించిన అధికారుల సేవలను గుర్తుంచుకుంటామని ప్రజా ప్రతినిధులు అన్నారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీ కాలం ముగుస్తుండడంతో బుధవారం సన్మాన కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. నాగిరెడ్డిపేట, గాంధారి, నిజాంసాగర్, కామారెడ్డి, బీబీపేట్, రాజంపేట్, దోమకొండ మండలాల ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, కో–ఆప్షన్ సభ్యులకు ఈ సందర్భంగా పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. పదవీ కాలం ముగిసినా.. ప్రజా సేవ చేస్తుంటామని ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు.







దేవునిపల్లిలో ఎంపీపీ ఆంజనేయులు, నాగిరెడ్డిపేటలో ఎంపీపీ వినీత, గాంధారిలో ఎంపీపీ రాధాబలరాంతోపాటు ఎంపీటీసీ సభ్యులకు..

## ఘనంగా గాడ్లిబ్ డైమ్లెర్ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న మెకానిక్‌లు

లింగంపేట, జూలై 3: మోటర్ సైకిల్ సృష్టికర్త గాడ్లిబ్ డైమ్లెర్ జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం గాడ్లిబ్ డైమ్లెర్ జయం తి సందర్భంగా కేక్ కట్ చేశారు. మెకానిక్‌ల సంఘం మండల అధ్యక్షుడు బాషు, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, యూసుఫ్, మెకానిక్‌లు రామకృష్ణ, నరేశ్, అనిల్, లక్ష్మణ్, సురేశ్, శివ, సుబ్బారానిల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట, జూలై 3: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని బాణాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం బాయంపల్లి, లింగంపల్లి గ్రామాల్లోని నర్సరీని పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటడానికి గుంతలు తవ్వి సిద్ధం చేయాలని సూచించారు. ఎంపీడీవోవెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, MOHAMMAD AMEENA BEGUM @ AMEENA ABDUL Changed My Name as AMINA BEE W/o ABDUL MAQBOOL R/o: 1-5-118/9/1, Zirayath Nagar, Armoor, Nzb.
NTZ-340156

CHANGE OF NAME
★I, LINGAPOORAM SRINIVAS Changed My Name as LINGAPOORAM SRINIVAS GOUD S/o LINGAPOORAM RAJA GOUD R/o: 11-52 (Vil) Mothe,(Mdl)Velpur,(D)Nzb.
NTZ-340156

CHANGE OF NAME
★I, MOHAMMED TOUSEEF, R/o. H.No. 9-9-46/4, Mogalpura Colony, Dist. Nizamabad, Now Changed my name as MOHAMMED TOUSEEF UDDIN.
NTZ-340156

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

### రూ.4.81లక్షలకు
## గాంధారి తైబజార్ వేలం

గాంధారి, జూలై 3: గాంధారి పంచాయతీ తైబజార్ వేలం రూ.4.81 లక్షలు పలికిందని ఎంపీవో రాజ్ కిరణ్‌రెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం వేలం నిర్వహించగా.. మండల కేంద్రానికి చెందిన తూర్పు సంతోష్‌కుమార్ రూ.4.81లక్షలకు కైవసం చేసుకున్నాడన్నారు. వేలంలో ఐదుగురు వ్యాపారులు పోటీ పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, పంచాయతీ ప్రత్యేక అధికారి సతీశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

***రూ.4.85లక్షలకు లింగంపేట తైబజార్..***

లింగంపేట, జూలై 3: లింగంపేట మేజర్ పంచాయతీ తైబజార్‌కు వేలంలో రూ.4లక్షల 85 వేల ఆదాయం లభించిందని పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ తెలిపారు. తొమ్మిది నెలల వ్యవధి కోసం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ అర్షద్ పాషా రూ.4.85లక్షలకు కైవసం చేసుకున్నాడు. దడువాయి వేలానికి ఎవరూ ముందుకు రాలేదని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. శుక్రవారం సంత నిర్వహించే ప్రాంతంలో వీధి దీపాలు, రహదారిపై గుంతలు పూడ్చి వేయాలని వ్యాపారులు కోరగా.. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, నాయకులు నయీం, నరేశ్, పంచాయతీ సిబ్బంది సాయిలుతోపాటు వ్యాపారులు పాల్గొన్నారు.

## హైవేపై ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న అధికారులు

పెద్ద కొడప్‌గల్, జూలై 3: జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని హైవే సిబ్బందికి సీఐ నరేశ్ సూచించారు. మండలంలోని బేగంపూర్ చౌరస్తా, జగన్నాథ్‌పల్లి, జుక్కల్ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారి161పై 15 రోజుల క్రితం జరిగిన మూడు రోడ్డు ప్రమాద ఘటనా స్థలాలను మండల అధికారులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ప్రమాదాల కారణాలను స్థానిక ఎస్సై కోనారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై యూటర్న్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని హైవే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యకాంత్, ఇన్సిడెంట్ మేనేజర్ సౌరభ్ ప్రతాప్, పోలీస్ సిబ్బంది రమేశ్, ఘోరీ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

రామారెడ్డి జూలై 3: మండలంలోని మద్దికుంట గ్రామ పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంపీడీవో సవితారెడ్డి బుధవారం పరిశీలించారు. పనులను రెండు రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం రెడ్డిపేట గ్రామాన్ని సందర్శించారు. వన మహోత్సవం కోసం తవ్విన గుంతలను పరిశీలించారు. పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

### ఆగస్టు 31వ తేదీ వరకు
## పంటల వివరాల నమోదు పూర్తిచేయాలి

నాగిరెడ్డిపేట, జూలై 3: గ్రామాల వారీగా సర్వే నంబర్ల ప్రకారం వానకాలంలో రైతులు సాగుచేస్తున్న పంటల వివరాల నమోదును ఆగస్టు 31 వరకు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి ఏడీఏ వీరాస్వామి సూచించారు. నాగిరెడ్డిపేట వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట వివరాల నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఏవో విజయ శేఖర్, ఏఈవోలు నిఖిత, దివ్య తదితరులు ఉన్నారు.

## 5న బిచ్కుందలో ధర్నా

బిచ్కుంద, జూలై 3: ప్రభుత్వ ఆస్తులు, రోడ్లు, భూగర్భ జలాల రక్షణ కోసం ఈనెల 3వ తేదీన ధర్నా నిర్వహించనున్నట్లు బిచ్కుంద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్ పటేల్ తెలిపారు. బిచ్కుందలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. గతనెల 22న కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినా.. ఇసుక అక్రమ రవాణా ఆగలేదన్నారు. ఇసుక అక్రమ రవాణా నివారించకుంటే సంబంధిత వ్యక్తులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి

నాగిరెడ్డిపేట, జూలై 3: మండల కేంద్రంలోని వ్యాపారులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని గోపాల్‌పేట పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య బుధవారం నోటీసులు అందజేశారు. ట్రేడ్ లైసెన్సుల కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అనుమతులు ఇస్తామని తెలిపారు.